అక్కణ్నించి బిహారి వంటింట్లోకివెళ్ళి చూస్తే, వంటపంతులుచేత సావిత్రి పాలుకాయిస్తూంది. ముందు స్నానానికి వెళ్ళిరమ్మని ఆమెను బలవంతపెట్టి, తరవాత సిగరెట్ తీసుకుని సతీశుడి వద్దకు వెళ్ళాడు.

"అయితే, అమె ఎక్కడుందిరా ?" అడిగాడు సతీశ్.

"పొద్దిటినుంచి పచ్చిమంచినీళ్ళు కూడా నోట పోసుకోలేదు బాబూ. ఇప్పుడే స్నానానికి పంపించి వస్తున్నా." తలుపు గొళ్ళెంపెట్టి దగ్గరగా వచ్చి కూర్చో మన్నాడు సతీశ్. పాదాలవద్ద కూచున్నాడు బిహారి.

"ఈ మాటు జ్వరం మళ్ళేట్టులేదు. ఒక్క మాటడుగుతా, దాయకుండా చెప్పు" మంటూ గుచ్చిగుచ్చి అడిగాడు సతీశ్. "సావిత్రిని నువ్వెక్కణ్నుంచి తీసుకొచ్చావ్, నిజం చెప్పూ !"

"చెప్పానుగా, కాశీనుంచని ?"

"అయితే, అక్కడ విపినబాబుని కలుసుకోలేదా ? నువు కళ్ళారా సావిత్రి పక్కమీద......?" అనేసరికల్లా బిహారీ "దాని కిదే శిక్ష...ఇదే, ఇదే...!!" అంటూ ధడీమని రెండు లెంపలూ వాయించుకున్నాడు.

"ఏమిటి వాగుతావ్ ?" అని గద్దించాడు, సతీశుడు. అప్పుడు బిహారి తను ఎరిగున్నదీ. మోక్షదా—చక్రవర్తీ చెప్పిందీ, సావిత్రి మాటలవల్ల గ్రహించిందీ, అంతా కొ_స్తయినా దాచకుండా, ఉన్నదున్నట్టు చెప్పాడు.

నిట్టూర్చాడు సతీశ్, "అయితే మరి, ఇంతవరకూ ఈ గొడవలన్నీ నాకెందుకు చెప్పావుకాదూ ?"

"నోరు విప్పిచెప్పలేకపోయా, బాబూ."

"ఎందుకని ?"

"చెప్పొద్దని నా చేత ఒట్టేయించుకుందండి "

బయట తలుపు కొట్టిన చప్పుడయింది. "ఇదేమిటి, గొళ్ళెంపెట్టుకు నిద్దరోయావా ? తలుపు తియ్ !"

యజమానికేసి చూశాడు బిహారి. సతీశ్ గప్‌మని కళ్ళు మూసుకు పడుకున్నాడు.

మళ్ళా పిలుపు !—"చెయి కాలుతుంది, తియ్ తలుపు !!"—

బిహారి తలుపు తీసి, మాటాడక వెళ్ళిపోయాడు.

(సశేషం)





# రెక్కలు

వాణీ సబ్నిస్

ఆ రోజున..

అన్నయ్య నాన్నతో పోట్లాడినంత విసురుగా మాట్లాడేడు. నాన్నతో అన్నయ్య అలా మాట్లాడతాడని కల్లోకూడా అనుకోలేదు.

అలాని, నాన్న వాడిని అంత అనరాని మాట ఏమీఅనలేదు. నాన్నకీ, అన్నయ్యకి జరిగిన సంభాషణ విన్న నేను నోరెళ్ళబెట్టి వుండిపోయాను.

నాన్న ఇంతకుమించి ఏమీ అనలేదు.

"ఏరాబాబూ! ఈ మధ్య జీతం అదీ. సరిగాఇవ్వడంలేదు, అదీగాకనువ్వు సరిగా యింటికి కూడా రావటంలేదు." అన్నారు

వాడసలేం ఆలోచించుకోకుండానే తేలిగ్గా అనేశాడు.

"నా ఇష్టం.కష్టపడిసంపాదిస్తుంది నేనూ ఆమాత్రం స్వాతంత్ర్యం నాకుండదా ? అయినా అంత కష్టంగావుంటే మీ ఇష్టం వచ్చిన చోటుకే వెళ్ళండి" అని.

ఎందుకో వాడిలో ఈమధ్య విపరీతంగా మార్పు కనబడుతోంది. నాకు త్వరగా పెద్దవాణ్ణయిపోతే బాగుణ్నని పించింది. ఇంత విపరీతంగా వస్తున్న ఈ మార్పువెనక అన్నయ్య ఏదో ఎక్కడో ప్రేమకధ నడుపుతున్నాడన్న అనుమానం కలిగింది నాకు.

అసమర్థుణ్ని. అన్నయ్య లాంటి వాడి తప్పుల్ని లెక్కపెట్టడాని కెన్ని దమ్ములు కావాలి. ఆరోజు తారీకు ఒకటి. ఆ నెల జీతం ఏమీఇవ్వలేనని చెప్పేశాడు. నాన్న ఏమీ అన్నారుకాదు.

"అలాగేబాబూ ! నీఇష్టం" అన్నారు. కానీ నెలరోజులు సంసారం గడవాలి. కానీ నేనేం చేయగలను ?

ముప్పైరోజులు ఇంటిలో అవసరాలు గడిచేది ఎలా ?

చదువుకొన్న వెధవకామాత్రం జ్ఞానం లేకపోతే ఎలాఅని తిట్టుకొన్నాను. ఆ రాత్రి కారణంలేకుండా అలిగి భోజనం చెయ్యకుండా పడుకొన్నాడు అన్నయ్య.

'బాగానేవుంది నాటకం' అనుకొన్నాను బాధగా.

మర్నాడు --

సాయంత్రం.

తోచక అలా పార్కువైపు కు వెళ్లాను.

పార్కులో –

అన్నయ్య. అన్నయ్య ప్రక్కనే అందమైన దుస్తుల్లో మెరిసిపోతూ ఓ అమ్మాయికూర్చుని వున్నారు. అన్నయ్య ఏదో చేస్తుంటే ఆవిడ విరగబడి నవ్వుతోంది.

నాకసహ్యంవేసింది.

భయంవేసింది. అన్నయ్యగానీ చూస్తాడేమో.

అన్నయ్య అయినదానికీ కానిదానికీ నన్ను తిడుతుంటాడు. సాధారణంగా వాడి కళ్ళబడకుండా తిరుగుతుంటాను. అలాంటిది అసలు పార్కుకొస్తేవూరుకొనే వూరుకోడు. అందునా తన నేరం బయట పడుతుందన్న కసితో ఏమన్నా చేస్తాడు.

ఓ హెల్! అనుకున్నంతా అయింది. నన్ను అన్నయ్య చూడనే చూసేడు.

'రంగా' అంటూ కేకేశాడు వెనకనించి

నేనుకదలకుండా నుంచున్నాను.

"రేయ్ విన్నేరా" అంటూ పిలిచేడు.

దగ్గరగా వెళ్లేను బెదురుతూ.

" వీడు నా తమ్ముడు రంగారావు. పి. యు. సి. చదువుతున్నాడు. "అంటూ ఆమెకి పరిచయం చేసేడు నన్ను.

" నమస్కారం " అంటూ చేతులు జోడించాను.



ప్రతి నమస్కారంచేసింది. ఆమెకేసి చూసేను. అందంగానే వుంది.

వెంటనే తలొంచుకొని మౌనంగా నుంచున్నాను.

"ఇటెక్కడికి వెడుతున్నావ్ ?" అడిగేడు అన్నయ్య.

నాకేంచెప్పాలో తోచలేదు. తడబడుతూ "ఇంట్లో ఏంతోచక ఇటువచ్చాను." సమాధానమిచ్చాను.

"ఇలా పార్కులవెంట తిరగటం మంచిది కాదు ఇంటికెళ్ళు" అన్నాడు మందలింపుగా.

వడివడిగా అడుగులు వేసుకుంటూ ఇంటికొచ్చి పడ్డాను.

ఆ పూట చాలా ప్రొద్దుపోయిన తరువాత వచ్చాడు అన్నయ్య.

" ఇంత సేపు ఎక్కడున్నావు బాబూ ! పది దాటినట్టుంది. " అడిగింది అమ్మ మందలింపుగా.

"ఆఫీసులో పనెక్కువగావుందమ్మా" కంచంలో మెతుకులు కెలుకుతూ అన్నాడు అన్నయ్య.

పక్కనే పడుకొనివున్న నాకు వింటుంటే వళ్ళు దహించుకొని పోయింది.

ఒక్క ఉదుటున లేచి, అమ్మకి నిజం చెప్పేయాలనిపించింది.

ఏమే అమ్మా ! వాడిమాటలేం నమ్మకే బాబూ! దౌర్భాగ్యుడు. సాయంత్రంనుంచి ఎవతో తిప్పలాడితో పార్కులో కుల్కికి మరీ వచ్చేడు. ఒరేయ్ అన్నయ్యా అబద్ధం చెప్పకు.మహాపాపంరా.అందునాఅమ్మతో తీరా నువ్వు కోస్తుంది. దేవుడున్నాడురా బాబూ! వెధవ వేషాలు వెయ్యకు. ఇప్పు డమ్మకి చెప్పిన తప్పుడు మాటలకి లెంప లేసుకో– అని బుద్ధిగా చెప్పాలనిపించింది నాకు.

కానీ అన్నయ్య నాకంటే వయసులో పెద్దవాడు. ఆ గౌరవంకొద్దీ నోరుమూసుకొని పడుకొన్నాను.

అమ్మమారు మాట్లాడలేదు. అమ్మ వట్టి పిచ్చిది. కాకపోతే వాడి మాటలు నిజమేనని నమ్ముతుందా?

"ఏదోనాయనా! నిన్ను ఒకఇంటివాణ్ణి చేస్తే నాకీబాధ్యత వుండదు. కృష్ణా రామా అంటూ వుండొచ్చు. కోడలుపిల్ల వస్తే అన్నీ చూసుకొంటుంది " అంటోంది అమ్మ.

ఆ సమయంలో ఎందుకో వాడిమొహం చూడాలనిపించి దుప్పటి పక్కకు నెట్టి చూసేను.

రాస్కెల్ ! ముసి ముసినవ్వులు నవ్వుతున్నాడు. వళ్ళుమండుతోంది నాకు ఆ అమ్మాయి గుర్తువచ్చిందేమో పాపం అనుకున్నాను.

మర్నాడు ఉన్నట్టుండి అన్నయ్య...

"రేయ్‌రంగా ! సాయంత్రంపూట పార్కులవెంట తిరక్కపోతే టైపు నేర్చుకోకూడదూ. టైపువస్తే ఉద్యోగం వివిషంలో దొరుకుతుంది" అన్నాడు.

"ఏమిటీ! వీడు పార్కుకి వెడుతున్నాడా!" నాన్న రెట్టించారు.

"రేయ్ నీ అబద్ధాలు మండిపోనూ పార్కులచుట్టూ ఆడపిల్లనివెంటేసుకొని పొద్దుపోయేవరకూ కూర్చునేది నువ్వా? నేనా? నీ తప్పులు బయటకు రాకుండా వుండటానికి నన్ను అడ్డేసుకుంటున్నావా? దుర్మార్గుడా! నేనేగనుక నీకంటే పెద్దాణ్ణై వుంటే ఈపాటికి నీదొక్క చించేవాణ్ణి."

ఆవేశంతో అనానిలపించింది నాకు. కానీ భయం.

ఇంతలో నాన్న పేము బెత్తం తీసుకొచ్చి, నావీపున రెండుఅంటించారు. చెయ్యని నేరానికి శిక్ష అనుభవించాల్సి నందుకుగ్గానూ ఏడుపొచ్చింది.

"చాల్లెండి ప్రయోజకత్వం. మొగపిల్లాడు పార్కుకి వెళ్ళటంతప్పా. ఆడపిల్లలు పార్కులకెళ్ళే ఈ రోజుల్లో వీడు వెళ్ళటం పొరపాటుఅయిందేం? అనవసరంగా వాడినెందుకొడతారు" అంటూ నాన్నగార్ని సన్నగా చివాట్లుపెట్టింది అమ్మ.

"అదేమిటినాన్నా! ఏదో వూరికే తిరుగుతున్నాడని బైపునేర్చుకోమంటే మంచిదని చెప్పానుగానీ. మీరింత సీరియస్‌గా తీసుకొంటారని అనుకోలేదు. అయినా నా ఒక్కడి సంపాదనతో ఇంత మందిని పోషించాలంటే కష్టంగావుంది. వాడుకూడా ఉద్యోగంచేస్తే వేణ్ణీళ్ళకు, చన్నీళ్ళతోడు. నా ఒక్కడివల్ల ఈ సంసారంఈదటం కష్టంనాన్నా" అన్నాడు అన్నయ్య.

నాన్న నిశ్చేష్టులైనారు.

"రేయ్ పెద్దబ్బాయ్ నీ మనసులో మాట మనసులోనే దాచుకుంటే నాకెలా తెలుస్తుందిరా! ఈ విషయం ఇన్ని రోజులూఎందుకుచెప్పలేదూ?" అడిగేరు నాన్న.

"ఇటువంటివిషయాలు ఒకరు చెప్పేవి కావునాన్నా? ఎవరిఅంతట వాళ్ళు తెలుసుకోవాలిసిందే. పరిస్థితులు అర్థం చేసుకోలేని పసివాళ్ళు ఎవరిక్కడ?" అడిగేడు అన్నయ్య.


అమ్మ తెల్లబోయి అన్నయ్య వంక చూసింది.

"భాస్కరంనాదేపొరపాటురా. వంట్లో శక్తి వుండీకూడా నేనీవిధంగా తిని కూర్చోవటం బాగోలేదు. రేపట్నించీ నాలుగు ట్యూషన్లు చెప్పుకొంటాను. పైగాప్రొద్దుపోతుంది. నాలుగు డబ్బులూ వస్తాయి. గోళ్ళు గిల్లుకుంటూ ఇంట్లో కూర్చుంటే ఏంవస్తుందీ?" వస్తున్న కన్నీళ్ళను పైకండువాతో వత్తుకొంటూ అన్నారు నాన్న. కానీ నాన్న గొంతులోని జీరని నేను పసిగట్టకపోలేదు. అప్పుడు నాకు ఏడుపొచ్చింది.

ఎలాగైనాసరే కష్టపడిచదివి ఉద్యోగం సంపాదించాలని నిర్ణయించుకొన్నానారోజు.








అంతే పట్టుదలతో పుస్తకాలతో కాలక్షేపం మొదలుపెట్టాను.

○ ○ ○

"నాన్నా నాకు ఉద్యోగం వచ్చింది. రేపు చేరమన్నారు." అని చెప్పేను, ఆర్డర్‌కాగితాన్ని నాన్నచేతిలో పెడుతూ.

"నిజంగానా," సంతోషంగా అడిగింది అమ్మ.

అంతలోనే అమ్మ మొహంలోవిషాద ఛాయలు కనిపించాయి. అమ్మ నవ్వాలని ప్రయత్నంచేసింది. కానీ ఆ నవ్వులో వెలితిని నేను గమనించేను.

అన్నయ్యకి ఆఫీసునుంచి రాగానే చెప్పేను.

"నాకు ఉద్యోగం వచ్చింది." అని.

"జాయినయ్యావా?" అనిమాత్రం అడిగేడు.

"రేపు జాయినవుతాను."

అంతకుమించి మా మధ్య సంభాషణ ముందుకి సాగలేదు.

మర్నాడు వెళ్ళి జాయిన్ అయ్యాను.

చాలా కొద్దిరోజుల్లోనే ఆఫీసులో పనిచేసే రాజేశ్వరితో నాకు పరిచయం కలిగింది.

ఎందుకో ఆ అమ్మాయి అంటే నాకో విధమైన అభిమానం కలిగింది. రోజూ మాట్లాడుకొంటూ వుండేవాళ్ళం. రాజేశ్వరిని గురించిన ఆలోచనలు నన్ను తినడం మొదలుపెట్టేయి.

ఈ సమస్యని ఎలా పరిష్కరించాలో

అర్థంకాక బుర్ర బద్దలుకొట్టుకునేపరిస్థితికి వచ్చేను.

ఇంతలో ఓ రోజు.

రిజిష్టరు మ్యారేజీ చేసుకొని, ఆమెని తీసుకొని గడపలోకాలుపెట్టేడు అన్నయ్య

అమ్మా నాన్నా దిగ్భ్రాంతు లయ్యారు.

అమ్మ గుండెలవిసేలా ఏడ్చింది.

"ఇంటికి పెద్దకొడుకువి. తల్లి తండ్రీ బ్రతికున్నాం అన్నమాట మరిచిపోయి ఇది నువ్వు చెయ్యదగినపనా? అంతగా, నీకు ఇష్టమయితే మేము కాదనేవాళ్ళమా? మీ నాన్నగారి పరువు ప్రతిష్టలగురించి, కొంచెమైనా ఆలోచించేవా? ఇంటికి పెద్దవాడివి. నీ వెనుక పుట్టినవాళ్లు ఏదైనా తప్పుచేస్తే మందలించ తగినవాడివి, నువ్వే ఇలా చేయడం ధర్మంకాదు," అంది అమ్మ ఏడుస్తూను.

అమ్మ కన్నీళ్ళకు అంతులేదు.

"నేను చేసినపని తప్పా? కానిపని ఏంచేసేను. నాకిష్టమయిన అమ్మాయిని పెళ్ళిచేసుకోవడం తప్పా? నా తప్పొప్పులు ఎంచే ధైర్యం ఈ రోజున ఈ ఇంట్లో మీ కందరికి ఎలా వచ్చిందో నాకు తెలుసు. రంగడు సంపాదిస్తున్నాడు, వీడు పెట్టి పోషించకపోయినా, బ్రతకలేక పోమనే ధీమా మీలో కలిగింది. అయినా. ఆడదానివి, ఆ మాత్రం తెలీదూ? కొత్త కోడలు, ఇంటికివస్తే ఎలా ఆదరించాలో ఇంత వయస్సు వచ్చిందీ, ఎందుకూ? ఏడవనూ......".

అన్నయ్య సిగ్గువదిలి అమ్మని అలా తక్కువగా మాట్లాడంతో నాకు ఆవేశమొచ్చింది.

"అన్నయ్యా!" హద్దుమీరి మాట్లాడుతున్నావ్. ఇంత వయసొచ్చిన అమ్మని, నిను కనిపెంచినతల్లిని. పరాయి ఆడదాని ముందు అంత చులకనగా మాట్లాడడానికి నీకు నోరెలావచ్చింది. ఛీ ఛీ. నువ్వు మనిషివికావు పశువ్వి."

నా చెంప చెళ్ళుమంది.

"ఏం కూశావు! నీ బోడిసంపాదన రెండొందలు చేతిలోపడుతున్నాయనా ఇంతపొగరు. వాళ్ళు దగ్గరుంచుకొని మాట్లాడుపరువుగా బ్రతకదల్చుకొంటే!" అన్నాడు అన్నయ్య.

"పరువు! పరువుగురించి మాటాడ్డానికి నీకు అర్హత లేదన్నయ్యా! ఇప్పుడు నువ్వు చేసినపని పరువుగలవాళ్ళు చేసేదేనా?" ఎక్కడలేని ధైర్యం తెచ్చుకొని అనేశాను.

"ఛీ ఛీ, ఇది ఇల్లుకాదు నరకం! ఈ నరకంలో మీరేవుండండి" అంటూ ఆమె చెయ్యిపట్టుకొని విసవిస గుమ్మందాటి వెళ్ళిపోయేడు అన్నయ్య.

విభ్రాంతుడినై నిలబడ్డాను.

"భాస్కరం! నాయనా...." అంటూ అమ్మ పిలుస్తున్నా వినిపించుకోకుండా





పందు మలుపుతిరిగి వెళ్ళిపోయాడు పెళ్ళాంతో సహా.

'రెక్కలొచ్చినపక్షి గూడును పట్టుకొని వుండమంటే ఎలావుండగలుగుతుందే! వెళ్ళనియ్యి." అంటూ నాన్న గదిలోంచి ఇవతలకొచ్చేరు.

నాకు దుఃఖంపొర్లుకొచ్చింది.

"నాన్నా, నన్ను క్షమించండి. అన్నయ్య నావల్లే ఇంట్లోంచి వెళ్ళిపోయేడు." అంటూ నాన్న కాళ్ళమీద పడ్డాను.

నాన్న కళ్ళు తడిఅవటం చూసేను.

తొందరపడ్డానేమో అనిపించింది. నాపై నాకే అసహ్యం వేసింది. ఏంచెయ్యాలో తోచటంలేదు.

ఆ రాత్రి రాజేశ్వరిగురించి ఆలోచించాను. చాలాసేపటివరకూ నిద్రపట్టలేదు. లేచి కాగితం, కలంతీసుకొని ఉత్తరంరాశాను.

"రాజేశ్వరీ!

తొందరపడి నీలో ఆశలురేపినందుకు నన్ను క్షమించు.

నా పైన బరువు బాధ్యతలు చాలా వున్నాయి. నాన్నకోసం, అమ్మకోసం, నేను బ్రతుకుతున్నాను. వాళ్ళకోసం నేను ఏమైనా అయిపోవడానికిసిద్ధం......

అందుకే...

వాళ్ళకోసం,

నిన్నుసైతం వదులుకోడానికి నేను వెనుదీయడంలేదు. కష్టపడి నన్నుపెంచినందుకు రెక్కలొచ్చాయని నేను వాళ్ళనొదులుకోలేను. అంత సాహసం నాకు లేదు.

ఇంతకంటే నన్నుగురించీ, నా కుటుంబంగురించీ నేనేం రాయదల్చుకోలేదు.

దయచేసి నన్ను మర్చిపో రాజేశ్వరీ!

ఇట్లు
రంగారావు.

ఉత్తరం పూర్తిచేయగానే నాకు ఏడుపొచ్చింది.

చిన్నవాడిని దేవుడు ఈ వయసులో నాకింత పెద్దపరీక్షలు పెడితే తట్టుకోలేని పసివెధవని.

గోడకి వ్రేలాడుతున్న వెంకటేశ్వరుడి పటంవంక చూసేను. ఏడుపు ఆపుకోలేక దిండులో మొహందాచుకొని వెక్కివెక్కి ఏడ్చాను.

